E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :334 ఆదివారం 15 నవంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

అమెరికాలో టైటానిక్ తరహా ప్రమాదం!



క్రూయిజ్ నౌకను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

180 మందితో నదిలో మునిగిన నౌక

ప్రయాణికులందరినీ రక్షించిన రెస్క్యూ సిబ్బంది

ప్రమాదంలో 32 మందికి గాయాలు

ఆసుపత్రులకు తరలించి చికిత్స 2 లో

ట్యాంకర్ అదుపుతప్పడంపై అధికారుల దర్యాప్తు

కాంగ్రెస్‌లో మెకెదాటు చిచ్చు!

2027-28 నుంచి కొత్త విద్యావిధానం

హైస్కూళ్లలోనే 11, 12 తరగతులు

ఇంటర్ చట్టం రద్దుకు ఆర్డినెన్స్

స్కూళ్లు, కాలేజీల విలీనానికి కసరత్తు

విలీనానికి న్యాయశాఖ అమోదం

ఉద్యోగుల కేడర్‌కు ఢోకా లేదు



2 లో

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): కావేరీ నదిపై ప్రతిపాదించిన మెకెదాటు డ్యామ్ ప్రాజెక్టు మరోసారి రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈసారి ప్రత్యర్థి పార్టీల మధ్య కాకుండా కాంగ్రెస్ పార్టీలోని ఇద్దరు ప్రముఖ నేతల మధ్యే విభేదాలు బహిరంగంగా బయటపడ్డాయి. తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ మణికం ఠాగూర్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మెకెదాటు డ్యామ్ ప్రాజెక్టు తమిళనాడు రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని మణికం ఠాగూర్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం తుది అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. తమిళనాడు హక్కులను కాపాడేందుకు అవసరమైతే ఎంతవరకైనా పోరాడతామని హెచ్చరించారు.

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల మైసూరులో ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో మెకెదాటు డ్యామ్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన తుది చట్టపరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మెకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని, ఈ ప్రాజెక్టుకు చట్టపరమైన పరిస్థితులు స్పష్టంగా ఉన్నాయని డీకే శివకుమార్ పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ వ్యాఖ్యలపై తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ మణికం ఠాగూర్ తీవ్రంగా స్పందించారు.

పేర్లు కాదు.. హామీలు నెరవేర్చండి!

రాహుల్‌కు హరీశ్ రావు సూటి ప్రశ్నలు

పథకాల పేర్లు కాదు.. హామీలు అమలు చేయాలి

మూడు బడ్జెట్లలోనూ పాత హామీలే

కూలీలకు రూ.12 వేల సాయం ఏదీ?

రాజీవ్ యువ వికాసం కాగితాలకే పరిమితం

రేవంత్ సర్కార్‌ను నిలదీయాలని డిమాండ్

జిమ్మిక్కులు కాదు.. సుపరిపాలన కావాలి 2 లో

రామ్‌లీలా సభలకు 50 వేలే పరిమితి!

రామ్‌లీలా మైదానంలో కొత్త రూల్స్

50 వేల మందికే సభలకు అనుమతి

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే

10 రోజుల ముందే అనుమతికి దరఖాస్తు

ట్రాఫిక్, పార్కింగ్ బాధ్యత నిర్వాహకులదే

ఆయుధాలు, డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు

తాగునీరు, వైద్య సదుపాయాలు తప్పనిసరి



2 లో

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): రామ్?లీలా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలు, నిరసన ప్రదర్శనల విషయంలో ఢిల్లీ పోలీసులు కీలక మార్పులు తీసుకురాబోతున్నారు. ఈ మేరకు నూతన మార్గదర్శకాలను సిద్ధం చేశారు. వీటి ప్రకారం ఇకపై ఈ మైదానంలో నిర్వహించే కార్యక్రమాలకు గరిష్ఠంగా 50 వేల మందికి మాత్రమే అనుమతి ఉంటుంది. అలాగే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సభలు, ప్రదర్శనలకు అవకాశం ఉంటుంది. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఏపీలో పల్లెపోరుకు భద్రతా కవచం!

పంచాయతీ ఎన్నికలపై ఎస్ఈసీ కీలక ఆదేశాలు

ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

19న ఎంపీపీ, 20న జెడ్పీ చైర్మన్ ఎన్నికలు

ఘర్షణలు జరగకుండా కఠిన చర్యలు

సమస్యాత్మక 12 జిల్లాలపై ప్రత్యేక నిఘా

అభ్యర్థులకు అవసరమైతే పోలీసు ఎస్కార్ట్

ఎన్నికల భద్రతపై అధికారులతో సమీక్ష 2 లో

బాలల అక్రమ రవాణాపై ఉక్కుపాదం!

బాలల అక్రమ రవాణాపై ఏపీ సర్కార్ ఉక్కుపాదం

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు

రాష్ట్ర కమిటీకి మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి చైర్‌పర్సన్

జిల్లా కమిటీలకు కలెక్టర్లు అధ్యక్షత

అదృశ్యమైన చిన్నారుల కేసులపై నిరంతర సమీక్ష

అక్రమ రవాణా ముఠాలపై ప్రత్యేక నిఘా

బాధిత చిన్నారులకు పునరావాసం కల్పించేలా చర్యలు 2 లో



కార్మికులకు కాంగ్రెస్ భరోసా!

- గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా
- ప్రతి డెలివరీపై 1 శాతం బోనస్
- కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యం: రాహుల్
- నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ నిధులు
- పని, ఆదాయ వివరాలు మొబైల్‌లోనే!
- పింఛన్, పొదుపు.. సామాజిక భద్రతకు భరోసా
- వైఫైతో ప్రత్యేక విశ్రాంతి కేంద్రాలు
- ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వైద్య సాయం
- గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): గిగ్ వర్కర్ల శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం దక్కేలా.. వారి హక్కులు, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఇప్పటివరకు గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్రసమాచారం అందుబాటులో లేదని, తాము చేస్తున్న పనికి ఎంత ప్రతిఫలం లభిస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం గతంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ విధానాలు కంపెనీల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. మిగతాది 2 లో..

ఉత్తరాంధ్రకు భారీ వర్ష గండం!

అల్పపీడనం వాయుగుండంగా..

16న అక్వాన్ తుఫాన్

120 కి.మీ వేగంతో గాలులు

19న తీరానికి అక్వాన్?

ఉత్తరాంధ్రకు భారీ వర్షాలు

17 నుంచి ఈదురుగాలులు

మత్స్యకారులకు హెచ్చరికలు



న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): బంగాళాఖాతంలో మరో తుఫాన్ ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న మరికొద్ది గంటల్లోనే వాయుగుండంగా బలపడనుందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. ఈ వాయుగుండం క్రమంగా బలపడుతూ ఈ నెల 16వ తేదీ సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో 'అక్వాన్' తుఫాన్‌గా రూపాంతరం చెందనుంది.

తుఫాన్‌గా మారిన అనంతరం ఇది ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడి 'తీవ్ర తుఫాన్'గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. 2 లో

కళ్లజోడులో కెమెరా గర్భాలయంలో కలకలం!



2 లో

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి ఆలయం లో తీవ్ర భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. స్పై కెమెరా (రహస్య కెమెరా) అమర్చిన కంటి అద్దాలతో ఓ భక్తుడు ఏకంగా గర్భాలయంలోకి ప్రవేశించడం తీవ్ర కలకలం రేపింది. అర్చకుడు చాకచక్యంగా వ్యవహరించి ఆ కళ్లజోడులో ఉన్న రహస్య కెమెరాను గుర్తించడం తో అసలు విషయం బయటపడింది.

మహిళా కోటాకు కేంద్రం భారీ స్కెచ్!

బిల్లుల ఆమోదానికి 361 ఓట్ల లక్ష్యం

15-18 ఓట్లు అదనంగా వస్తాయని ధీమా

లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి పెంపు

2029 ఎన్నికల ముందే మహిళా రిజర్వేషన్లు

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలపై కసరత్తు



2 లో

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్ బిల్లు), మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ఈ బిల్లుల్ని ఆమోదింపచేసుకోవడానికి కావాల్సిన మద్దతు కూడగట్టే పని ఇప్పటికే తెర వెనక జరుగుతోంది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపచేసుకోవడానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. సభలో 361 ఓట్లు సాధించాల్సి ఉంది.

మెజారిటీ కన్నా ఎక్కువ ఓట్లపై కేంద్రం ధీమా..

అయితే, మెజారిటీ సాధించే విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఫుల్ ధీమాగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మెజారిటీ సాధించే విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఫుల్ ధీమాగా ఉన్నట్లు తెలుస్తోంది.

సోనియాపై వ్యాఖ్యలు.. కంగనాపై కేసు



కంగనా రనౌత్‌పై పోలీసుల ఎఫ్ఐఆర్

సోనియా గాంధీపై అనుచిత వ్యాఖ్యలే కారణం

రిటైర్డ్ కెప్టెన్ ఫిర్యాదుతో కేసు నమోదు

మూడు బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు 2 లో

నవంబర్ 10న సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టు

విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలున్నాయంటూ ఆరోపణ

డిజిటల్ ఆధారాల పరిశీలనకు సైబర్ పోలీసుల చర్యలు

బెస్ట్: పేర్లు కాదు.. హామీలు నెరవేర్చండి!



న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేర్లతో పథకాలు పెడితే సరిపోదని ఆ హామీలను నెరవేర్చినప్పుడే వారికి నిజమైన గౌరవం అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్ల వైఫల్యాలపై సమీక్ష జరిపి లెక్క అడగాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నిరుపేద కూలీలు, నిరుద్యోగ యువతను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా మోసం చేస్తోందో ఎండగడుతూ రాహుల్ గాంధీని సూటిగా ప్రశ్నించారు. అమలుకు నోచుకోని పథకాలకు ఆ మహనీయుల పేర్లు పెట్టి ప్రజలను మోసం చేయడం వారిని అవమానించడమే అవుతుంది.

హామీలు ఇవ్వడం తిరగబోయడం:

రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్ల ఫార్ములా చాలా సింపుల్ గా ఉందని.. హామీలు ప్రకటించడం, పాత ప్రకటనలనే మళ్లీ కొత్త బడ్జెట్‌లో తిరగబోయడం.. చివరకు పైసా ఇవ్వకుండా ఎగ్గొట్టడం అని హరీశ్ రావు విర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సింది పోయి, పాత బడ్జెట్ ప్రకటనలనే మళ్లీ మళ్లీ ప్రచారం చేసుకుంటున్నారని దీంతో నిరుపేద కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ప్రభుత్వ సాయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారన్నారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12,000 ఆర్థిక సాయం అందిస్తామని 2024-25 బడ్జెట్‌లో ఘనంగా ప్రకటించారు. ఆ తర్వాత 2025-26 బడ్జెట్‌లోనూ ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారు. కానీ వరుసగా మూడు బడ్జెట్లు పూర్తయినా నేటికీ ఆ నిరుపేద కూలీలకు ఇస్తామన్న రూ. 12 వేల సాయం అందలేదు. కాంగ్రెస్ భాషలో హామీల అమలు అంటే ఇదేనా? అని ప్రస్నించారు.

కూవాల్సింది జిమ్మిక్కులు కాదు

'రాజీవ్ యువ వికాసం' బడ్జెట్ కాగితాలకే పరిమితం అయిందని తన సొంత మేనిఫెస్టో హామీలను ఇంత దారుణంగా తుంగలో తొక్కడాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా సమర్థించుకుంటుందన్నారు. ఇకనైనా రాజకీయ నినాదాలు, ఉపన్యాసాలు పక్కన పెట్టాలన్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడంతోనే మీ బాధ్యత తీరిపోదని అమలు కాని ప్రతి మేనిఫెస్టో హామీపై రేవంత్ రెడ్డిని నిలదీసి లెక్క అడగాలన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నది జిమ్మిక్కులు కాదు.. సుపరిపాలన! మోసాలు కాదు.. హామీల అమలు..పాత హామీల తిరగబోత కాదు.. ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలన్నారు.

కళ్లజోడులో కెమెరా.. గర్భాలయంలో కలకలం!

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనకు సంబంధించి మహారాష్ట్రలోని పూణేకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడిని భద్రతా సిబ్బంది, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూణేకు చెందిన అంకేష్ అగర్వాల్ తన కుటుంబసభ్యులతో కలిసి శ్రీకాళహస్తి ఆలయ దర్శనానికి వచ్చాడు.

రూ.5 వేల టికెట్‌పై రాహు-కేతు పూజలు నిర్వహించుకున్న అనంతరం, ఆయన ముందుగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి గర్భాలయంలో దర్శనం పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో అక్కడి భద్రతా సిబ్బంది గానీ, ఇతరులు గానీ ఆయన ధరించిన కళ్లజోడును గమనించలేదు. అనంతరం జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఆలయం లోకి వెళ్లినప్పుడు, ఆయన కళ్లజోడులో అమర్చిన కెమెరా నుంచి లైట్ బ్లింక్ అవ్వడాన్ని అక్కడి పూజారి గమనించారు.వెంటనే అప్రమత్తమైన పూజారి ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఎస్పీఎఫ్ సిబ్బంది అంకేష్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకుని, ఆయన ధరించిన స్పై కెమెరా కళ్లజోడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రామ్‌లీలా సభలకు 50 వేలే పరిమితి!

మొదటి పేజీ తరువాయి

అనుమతుల కోసం 10 రోజుల ముందే దరఖాస్తు

రామ్‌లీలా మైదానంలో కార్యక్రమం నిర్వహించాలనుకునే నిర్వాహకులు ముందుగా మైదానం అందుబాటులో ఉందో లేదో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ నుంచి నిర్ధారించుకోవాలి. ఆ తర్వాత పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా కార్యక్రమం నిర్వహించడానికి కనీసం 10 రోజుల ముందే దరఖాస్తు తప్పనిసరి. సభలు, నిరసనలకు వచ్చే ప్రజల నిర్వహణ బాధ్యత పూర్తిగా నిర్వాహకులపై ఉండనుంది. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవడం, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయడం, ప్రజలను దింపేందుకు ప్రత్యేక ప్రాంతాలను కేటాయించడం తప్పనిసరి చేయనున్నారు. రహదారులు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రతిపాదించారు.

ఆయుధాలు, డ్రోన్లపై ఆంక్షలు

భద్రతా చర్యల్లో భాగంగా తుపాకులు, కత్తులు, ఈటెలు, పదునైన వస్తువులు, నిషేధిత సామగ్రిని సభా ప్రాంగణంలోకి తీసుకురావడంపై ఆంక్షలు విధించనున్నారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లో డ్రోన్లు వినియోగించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి కానుంది. కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజల సౌకర్యార్థం నిర్వాహకులు తాగునీరు, వైద్య సహాయం, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అలాగే కార్యక్రమం ముగిసిన తర్వాత చెత్తను సక్రమంగా తొలగించే బాధ్యత కూడా నిర్వాహకులపైనే ఉండనుంది. ఈ కొత్త మార్గదర్శకాలకు సంబంధించిన ముసాయిదా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ను ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఇది ప్రాథమిక దశలోనే ఉందని, సంబంధిత అధికారుల పరిశీలన, ఆమోదం తర్వాత తుది మార్గదర్శకాలు అమల్లోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఈ నిబంధనలు ప్రతిపాదన దశలోనే ఉన్నాయని, తుది నిర్ణయం వెలువడాల్సి ఉందని స్పష్టం చేశారు.

మహిళా కోటాకు కేంద్రం భారీ స్కెచ్!

మొదటి పేజీ తరువాయి

361 ఓట్ల కన్నా 15-18 ఓట్లు అదనంగా వస్తాయని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఈ బిల్లుల ఆమోదానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. అయితే, ఈ సమావేశాలు ఎప్పుడు ఉంటాయనే దానిపై స్పష్టత లేదు.

మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ఈ బిల్లుల ముఖ్య ఉద్దేశం. ఇందు కోసం లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న ఎంపీల సంఖ్య 543 నుంచి 850కి పెంచాలని కేంద్రం యోచిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఈ స్థానాలు పెంచాలని చూస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్లను అమలులోకి తీసుకురావాలని బీజేపీ లక్ష్యం పెట్టుకుంది.

ఏప్రిల్‌లో వీగిపోయిన బిల్లు.. ప్రత్యేక సమావేశాలకు ఛాన్స్..

మహిళా రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లును ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల ప్రత్యేక భేటీలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయితే, బిల్లు ఆమోదానికి కావాల్సిన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓట్లేశారు. దీంతో బిల్లు ఆమోదం పొందలేదు.

మరోవైపు, పార్లమెంట్ వర్షాకల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఆ సమావేశాలు అధికారికంగా ప్రొరోగ్ కాలేదు. దీంతో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ఎప్పుడైనా జరిగే అవకాశం ఏర్పడింది.

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిశీలన..

లోక్‌సభ స్థానాల సంఖ్య 850 వరకు పెంచే ప్రతిపాదనలో భాగంగా ప్రతీ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్రం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనల్ని కూడా పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగా యథాతథంగా కొనసాగించే ప్రతిపాదన కూడా చర్చలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలను చెబుతున్నాయి. మెరుగైన జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోనియాపై వ్యాఖ్యలు.. కంగనాపై కేసు

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ ఇటీవల సోనియా గాంధీపై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, కుటుంబంపై సోషల్ మీడియాలో అభ్యంతరకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో బాలీవుడ్ నటి, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై పోలీసు కేసు నమోదైంది. రిటైర్డ్ కెప్టెన్ అతుల్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిమ్లాలోని బాలుగంజ్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత లోని మూడు కీలక సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సిమ్లా ఎస్పీ గౌరవ్ సింగ్ ధృవీకరించారు.

నవంబర్ 10న కంగనా రనౌత్ తన సోషల్ మీడియా ఖాతాల్లో సోనియా గాంధీని 'అనుమానాస్పద విదేశీయురాలు' అని అభివర్ణిస్తూ, ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీల మరణాలపై తీవ్ర ఆరోపణలు చేస్తూ పోస్ట్ పెట్టారని ఫిర్యాదుదారు అతుల్ శర్మ పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని ఆయన డీజీపీకి పంపిన ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం (సెక్షన్ 196), ప్రజల్లో భయాందోళనలు సృష్టించే తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం (సెక్షన్ 353), పరువు నష్టం (సెక్షన్ 356) కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ పోస్టులకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను సైబర్ ఫోరెన్సిక్ విభాగం ద్వారా పరిశీలించాలని ఫిర్యాదుదారు కోరారు.

బాలల అక్రమ రవాణాపై ఉక్కుపాదం!

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): రాష్ట్రంలో బాలల అక్రమ రవాణా ను సమర్థవంతంగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అక్రమ రవాణా నిరోధక చర్యలను నిరంతరం పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీకి మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రతినిధులతో పాటు డీజీపీ, సీఐడీ, పోలీస్, విద్యా, కార్మిక, వైద్య ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులకు సభ్యులుగా స్థానం కల్పించారు. అంతేకాదు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయి కమిటీకి సంబంధిత జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించనుండగా, జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్ కో-చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమష్టి కృషితో బాలల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అదృశ్యమైన చిన్నారుల కేసులపై సమీక్ష

ఈ రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ప్రధానంగా రాష్ట్రంలో అదృశ్యమైన చిన్నారుల కేసులను ఎప్పటికప్పుడు నిశితంగా సమీక్షించనున్నాయి. తప్పిపోయిన పిల్లల ఆచూకీని వేగంగా కనుగొనడం, అక్రమ రవాణా ముఠాల ఆటకట్టించడం, బాధిత చిన్నారులకు సరైన పునరావాసం కల్పించే దిశగా ఈ కమిటీలు పనిచేస్తాయి. అన్ని శాఖల సమన్వయంతో కూడిన ఈ నూతన వ్యవస్థ వల్ల రాష్ట్రంలో బాలల అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

అమెరికాలో టైటానిక్ తరహా ప్రమాదం!

న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో టైటానిక్ తరహా పడవ ప్రమాదం చోటు చేసుకుంది. పోర్ట్ ఆఫ్ న్యూ ఓర్లీన్స్ సమీపంలోని మిస్సిస్సిప్పి నదిలో భారీ నౌక ప్రమాదం వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే.. అదుపుతప్పిన ఒక ఆయిల్ ట్యాంకర్ నౌక, నది ఒడ్డున నిలిపి ఉంచిన (డాక్ చేసిన) రివర్ క్రూయిజ్ నౌకను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో 'అట్లాంటిక్ ఆస్చాల్ట్' అనే ట్యాంకర్ నౌక, 'అమెరికన్ క్రూయిజ్ లైన్స్' సంస్థకు చెందిన 'అమెరికన్ హెరిటేజ్' క్రూయిజ్ నౌకను ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాదం జరిగిన సమయంలో క్రూయిజ్ నౌకలో సుమారు 180 నుంచి 190 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. దీంతో ప్రయాణికులతో సహా ఆ పడవ మునిగిపోయింది. ఇది గమనించిన రెస్క్యూ సిబ్బంది పడవలోని ప్రయాణికులందరిని రక్షించారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన 32 మందిని చికిత్స నిమిత్తం సమీపంలోని స్థానిక ఆసుపత్రులకు తరలించినట్లు న్యూ ఓర్లీన్స్ మేయర్ హెలెనా మోరెనో వెల్లడించారు. అయితే, అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయ స్థితి, తీవ్రమైన గాయాలు కాలేదని, అందరి పరిస్థితి నిలకడగా ఉందని మేయర్ స్పష్టం చేశారు. ట్యాంకర్ అదుపుతప్పడానికి గల సాంకేతిక కారణాలపై అమెరికా కోస్ట్ గార్డ్, పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్‌లో మెకెదాటు చిచ్చు!

మొదటి పేజీ తరువాయి

మణికం ఠాగూర్ తన సోషల్ మీడియా పోస్టులో డీకే శివకుమార్ వైఖరిని తప్పుబట్టారు. కావేరీ జల వివాద ట్రైబ్యునల్ తుది తీర్పు, సుప్రీంకోర్టు నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. కర్ణాటక సీఎం మెకెదాటు ప్రాజెక్టుపై పట్టుదలగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని, తమిళనాడు రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కావేరీ నదీ జలాల పంపిణీ వ్యవస్థలో తమిళనాడు దిగువ తీర రాష్ట్రంగా ఉందని మణికం ఠాగూర్ పేర్కొన్నారు. అందువల్ల తమిళనాడు హక్కులపై ప్రభావం చూపే ప్రాజెక్టులను కర్ణాటక ఏకపక్షంగా అమలు చేయలేదని ఆయన వాదించారు. దిగువ తీర రాష్ట్రాల అంగీకారం లేకుండా మెకెదాటు డ్యామ్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. తమిళనాడు సమ్మతి లేకుండా ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే అది చట్టపరమైన సమస్యలకు దారి తీస్తుందని, ముఖ్యంగా కావేరీ డెల్టా ప్రాంతంలోని రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు కాంగ్రెస్ తరఫున మెకెదాటు ప్రాజెక్టును అడ్డుకునేందుకు పోరాడతామని స్పష్టం చేశారు.

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం మెకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రతిపాదిత డ్యామ్‌కు సంబంధించిన చట్టపరమైన అంశాలపై సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయం ఇచ్చిందని, ప్రస్తుతం పరిస్థితి స్పష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. బెంగళూరు నగరానికి పెరుగుతున్న తాగునీటి అవసరాలను తీర్చడానికి మెకెదాటు ప్రాజెక్టు అవసరమని కర్ణాటక ప్రభుత్వం వాదిస్తోంది.

మెకెదాటు డ్యామ్‌ను కర్ణాటకలోని కావేరీ నదిపై నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది డీకే శివకుమార్ స్వస్థలం కనకపుర సమీప ప్రాంతంలో నిర్మించాలనే ప్రణాళిక ఉంది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాల్లో బెంగళూరు నగరానికి తాగునీటి సరఫరా పెంచడం, కావేరీ జలాలను నిల్వ చేయడం, కరువు పరిస్థితుల్లో నీటి నిర్వహణకు సహాయపడటం వంటి అంశాలు ఉన్నాయి. కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ద్వారా బెంగళూరు తాగునీటి సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చని చెబుతోంది. అలాగే దిగువ ప్రాంతాలకు కూడా అవసరమైన సమయంలో నీటి నిర్వహణకు ఇది ఉపయోగపడుతుందని వాదిస్తోంది.

మెకెదాటు ప్రాజెక్టుపై తమిళనాడు చాలా కాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కావేరీ జలాల ప్రవాహంపై డ్యామ్ ప్రభావం పడవచ్చని, ముఖ్యంగా తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంత రైతులకు నీటి సరఫరా తగ్గే ప్రమాదం ఉందని తమిళనాడు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదే అంశం రెండు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న కావేరీ జల వివాదానికి మరో కీలక కోణంగా మారింది.

ఈ అంశంలో ఆసక్తికర విషయం ఏమిటంటే, మెకెదాటు ప్రాజెక్టుకు మద్దతు ఇస్తున్న కర్ణాటక సీఎం డీకే శివకుమార్, వ్యతిరేకిస్తున్న తమిళనాడు ఎంపీ మణికం ఠాగూర్ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీకే చెందిన నేతలు. రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో ఒకే పార్టీలోని నేతలు కూడా వేర్వేరు వైఖరులు తీసుకోవడం భారత రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కావేరీ జల వివాదం వంటి రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన అంశాల్లో రాజకీయ పార్టీల కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందనే చర్చకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

ఏపీలో పల్లెపోరుకు భద్రతా కవచం!



న్యూస్ డెస్క్, 14 నవంబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆయన పోలీసు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై కీలక వివరాలను వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి, ఫలితాలను కూడా ప్రకటించామని అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు.

తదుపరి దశలో భాగంగా ఈ నెల 19న ఎంపీపీ, 20న జెడ్పీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల డిప్యూటీ చైర్మన్ల ఎన్నికల ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో పల్నాడు నుంచి రాయలసీమలోని కొన్ని ప్రాంతాల వరకు చెదురుమదురు ఘర్షణలు చోటు చేసుకున్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన.. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడామని, నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ఎవరైనా భద్రత కోరితే ప్రత్యేక ఎస్కార్ట్‌ను కూడా కల్పిస్తామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా భరోసా ఇచ్చారు.

ఉత్తరాంధ్రకు భారీ వర్ష గండం!

మొదటి పేజీ తరువాయి

సముద్రం పైనే దీని తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ఆ సమయంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది.

తీరం దాటే అంచనాలపై ఉత్కంఠ

ప్రస్తుత వాతావరణ నమూనాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ రాత్రికి ఈ తుఫాన్ తీరానికి చేరే అవకాశం ఉంది. అయితే, తీరం దాటే సమయానికి తుఫాన్ గమనం, దాని తీవ్రతకు సంబంధించిన అంచనాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సముద్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఇది ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉండగా, దిశ మార్చుకుంటే ఒడిశా, పశ్చిమ బెంగాల్ లేదా బంగ్లాదేశ్ వైపు వెళ్లే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన..

తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారనుంది. ముఖ్యంగా ఈ నెల 18, 19 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 17 నుంచే తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తక్షణమే తీరానికి తిరిగి రావాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కార్మికులకు కాంగ్రెస్ భరోసా!

మొదటి పేజీ తరువాయి

గిగ్ వర్కర్లను వెట్టిచాకిరీ చేసే కార్మికులుగా మార్చి, వారి శ్రమను దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లను కేవలం సేవలందించే వ్యక్తులుగా కాకుండా, దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వారి హక్కులతోపాటు కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త పాలసీ ప్రధాన ఉద్దేశమని రాహుల్ గాంధీ వివరించారు. ఈ విధానం ద్వారా వారి పని, డెలివరీలు, శ్రమకు లభించే ప్రతిఫలానికి సంబంధించిన వివరాలను నేరుగా మొబైల్ ఫోన్లలో తెలుసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటివరకు సరైన సమాచారం లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యలకు ఈ వ్యవస్థ పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి కేటాయించి, బోర్డు ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

డెలివరీలు, ఇతర పనుల సమయంలో ప్రమాదాలు జరిగినా, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనా గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారికి భరోసా కల్పించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు వంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఈ చర్యలు కార్మికులకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించడంలో కీలకమవుతాయని అభిప్రాయపడ్డారు.

మరోవైపు, పని మధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు గిగ్ వర్కర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. వైపై సౌకర్యంతో కూడిన విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్మికుల పని పరిస్థితులు మెరుగుపడటంతోపాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించడమే ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన ఆలోచనగా వివరించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. గిగ్ వర్కర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్మికులకు మెరుగైన భద్రత, ఆరోగ్య సదుపాయాలు, ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు ప్రభుత్వం పలు కీలక ప్రయోజనాలు కల్పిస్తోందని సీఎం వివరించారు. విధి నిర్వహణలో ప్రమాదాలు ఎదురైనప్పుడు ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రమాద బీమా సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ఆరోగ్యశ్రీ

పంటల మార్పిడి ప్రణాళికల రూపకల్పనపై ఉన్నతస్థాయి సమీక్ష

రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 14 (తెలుగు గళం)

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని చాగల్ రైతు వేదికలో పంటల మార్పిడి ప్రణాళికల రూపకల్పనపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు శనివారం ఉదయం వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారుల అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య పాల్గొన్నారు. డివిజన్ స్థాయి వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పంటల మార్పిడి ప్రణాళికలను పక్కాగా రూపొందించాలని ఉన్నతాధికారులు సూచించారు. రైతులకు అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి ప్రణాళికలను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.

కొత్తపల్లి శివారులో కొనసాగుతున్న భూ సర్వేను పరిశీలించిన ఆర్డీఓ కిరణ్ ప్రకాష్

స్టేషన్ ఘన్‌పూర్ నవంబర్ 14 (తెలుగు గళం)



మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న భూ పునఃపరిశీలన సర్వేను శనివారం స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి యస్. కిరణ్ ప్రకాష్ పరిశీలించారు. స్థానిక నాయబ్ తహశీల్దార్ సంధ్యారాణితో కలిసి సర్వే పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు తమ భూముల సరిహద్దులను సర్వే సిబ్బందికి స్పష్టంగా చూపించాలని, ఇరువైపుల రైతులు సమన్వయంతో సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేని విధంగా స్పష్టమైన భూ రికార్డుల తయారీలో ఈ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్ శ్రీకాంత్, సర్వే సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జనగామ కాన్సెప్ట్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో ఆకట్టుకున్న విద్యార్థులు



జనగామ, నవంబర్ 14 (తెలుగు గళం)

జనగామ పట్టణంలోని కాన్సెప్ట్ పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రముఖ వ్యక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, పౌరాణిక పాత్రలతో పాటు సామాజిక సందేశాలను అందించే విభిన్న వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ పాత్రలకు అనుగుణంగా చక్కటి అభినయం ప్రదర్శిస్తూ, ఆత్మవిశ్వాసంతో ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ధైర్యం, వేదికపై మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పాఠశాల యాజమాన్యం నిమ్మ రామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నిమ్మ రూపాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను అభినందించి వారిని ప్రోత్సహించారు.

తిమ్మాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

సైబర్ క్రైమ్, డ్రగ్స్, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన



జఫర్‌గఢ్ నవంబర్ 14 (తెలుగు గళం)

గ్రామీణ ప్రజలకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు తిమ్మాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు పాటలు, నాటికలు, ప్రదర్శనల ద్వారా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సీఐ సంజీవరావు, జఫర్‌గఢ్ ఎస్ఐ వినయ్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ నగరంలో పట్టణ ఉపాధి హామీ పథకం అమలు చేయాలి

-- ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి



వరంగల్ నవంబర్ 14 (తెలుగు గళం)

నగరంలోని నిరుద్యోగం, పేదరికం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, రోజువారీ కూలీ పనులు దొరకక పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఎంసీపీఐ (యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వరంగల్‌లోని ఓంకార్ భవన్ పార్టీ జిల్లా కార్యాలయంలో సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఎంసీపీఐ (యు) వరంగల్ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని అనేక నిరుపేద కుటుంబాలు రోజువారీ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నాయని, పనులు దొరకక కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల తరహాలో పట్టణాల్లోనూ చట్టబద్ధమైన ఉపాధి హామీ కల్పించాలని, మురికివాడలు, బస్తీల్లోని నిరుద్యోగ యువత, మహిళలు, అసంఘటిత రంగ కార్మికులకు స్థానికంగానే పని కల్పించేలా ప్రత్యేక పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ పథకం ద్వారా చెరువులు, కుంటల అభివృద్ధి, డ్రైనేజీల శుభ్రత, పారిశుద్ధ్య పనులు, రోడ్ల మరమ్మతులు, పచ్చదనం పెంపకం, వర్షపు నీటి సంరక్షణ వంటి పనులు చేపట్టవచ్చని తెలిపారు. దీంతో పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు నగర అభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి ప్రతి అర్హులైన పేద కుటుంబానికి పని కల్పించాలని, చేసిన పనికి నిర్ణీత సమయంలో కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచితంగా అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నగర కార్యదర్శి మాలోతు సాగర్, సింగతి సాంబయ్య, ముక్కెర రామస్వామి, బాసిపాక రమేష్, గణిపాక ఓదెలు, ఐతం నగేష్, మాలోతు ప్రత్యూష, సింగారపు దాసు, ఎగ్గేని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, అప్పనపూరి నర్సయ్య, రాయినేని ఐలయ్య, బావు రామస్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

చీటకోడూర్ రామలింగేశ్వర ఆలయంలో సినిమా షూటింగ్ ప్రారంభం

జనగామ యువకుల ఆధ్వర్యంలో 1990 నాటి సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చిత్ర నిర్మాణం



జనగామ రూరల్ నవంబర్ 14(తెలుగు గళం)

జనగామ ప్రాంత చరిత్ర, ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారం కోసం సాగిన పోరాటాల ఇతివృత్తంతో రూపొందిస్తున్న నూతన తెలుగు సినిమా షూటింగ్ చీటకోడూర్‌లోని రామలింగేశ్వర దేవాలయంలో ప్రారంభమైంది. చిత్ర దర్శకుడు చాగంటి టింకు (జితేందర్) మాట్లాడుతూ.. 1990 ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, నిర్బంధాలు, వాటికి వ్యతిరేకంగా యువత సాగించిన పోరాటాలు, కుటుంబ సంబంధాలు, త్యాగాలు, అవినీతికి వ్యతిరేకంగా యువకులు పోషించిన పాత్ర వంటి అంశాలను ఆధారంగా చేసుకొని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. వాస్తవ సంఘటనలతో పాటు కొన్ని కల్పిత అంశాలను కూడా చిత్రంలో పొందుపరుస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, జనగామ మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనగామకు చెందిన యువకులు సామాజిక దృక్కోణంతో సినిమా నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. జనగామ ప్రాంత కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, పోరాటయోధులు, సామాజిక ఉద్యమకారులకు నిలయమని పేర్కొన్నారు. ప్రాంత చరిత్రను ప్రతిబింబించేలా సినిమా రూపొందించడం గర్వకారణమని, చిత్ర విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సీనియర్ రిపోర్టర్ తిప్పారపు ఉపేందర్, డైలాగ్ రైటర్ ఉప్పునూతల మధు, నటుడు, సహాయ దర్శకుడు మధు కన్నా, కెమెరా డీఓపీ క్రాంతి నీల, నటుడు జగన్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఎలుకట్టే జగన్నాథం, రంగు రాజశేఖర్, పాత్రికేయులు రాజు, గోపగోని వినయ్, జర్రిపోతుల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపం ఉన్నవారికి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలి

కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ఖర్చు తగ్గించి పేదలకు చేరువ చేయాలి -- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమర్థవంతమైన స్క్రీనింగ్ వ్యవస్థ ఉండాలి



హనుమకొండ, నవంబర్ 14 (తెలుగు గళం)

వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి అత్యాధునిక వైద్య సాంకేతికతతో మెరుగైన చికిత్స అందుబాటులోకి రావాలని, ముఖ్యంగా కాక్లియర్ ఇంప్లాంట్ వంటి ఖరీదైన చికిత్సల వ్యయాన్ని తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు చేరువ చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.హనుమకొండ బాలసముద్రంలోని సేవకా రీజెన్సీ, రాయల్ డెక్కన్ హోటల్స్‌లో అపర్ణ ఈఎన్‌టీ హాస్పిటల్, అపర్ణ రాయ్ ఈఎన్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఎఓఐ తెలంగాణ సహకారంతో నిర్వహించిన 'సిఐ ఫ్రంటియర్స్--2026' సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వైద్య రంగంలో పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యాధుల లక్షణాల ఆధారంగా చికిత్స అందించడమే కాకుండా వాటి మూలకారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు కనుగొనే దిశగా కృషి చేయాలని సూచించారు.పర్యావరణ కాలుష్యం, ఆహార కల్తీ, ప్లాస్టిక్ వినియోగం, మైక్రోప్లాస్టిక్స్ ప్రజారోగ్యంపై చూపుతున్న ప్రభావాలపై పరిశోధనలు జరగాలన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడటంతో పాటు చికిత్స ఖర్చును కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలని కోరారు.పార్లమెంటరీ స్థాయి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిటీలో సభ్యురాలిగా ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నట్లు తెలిపారు.కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు, ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఒక్కో కేసుకు సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చవుతోందని వివరించారు. పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ఈ చికిత్స ఎంతో ప్రయోజనకరమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ ఈ వైద్య అవకాశాన్ని కోల్పోకూడదన్నారు. భవిష్యత్తులో చికిత్స ఖర్చు తగ్గించి సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.వరంగల్ వైద్య రంగానికి విశేష సేవలందిస్తున్న సీనియర్ వైద్యుల అనుభవం, మార్గదర్శకత్వం యువ వైద్యులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అపర్ణ ఈఎన్‌టీ హాస్పిటల్, అపర్ణ రాయ్ ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్ కామేశ్వరన్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సుదీప్, డాక్టర్ ద్వారకనాథ్, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రణవీర్ సింగ్, డాక్టర్ ఏకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఇమ్మడి ఇక లేరు


సత్తుపల్లి, ఆర్ సి, నవంబర్ 14 (తెలుగు గళం) న్యూస్:

సత్తుపల్లి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య పెద్దలు, ప్రముఖులు, వ్యాపార దిగ్గజం, ప్రముఖ గైనిక్ వైద్యులు డాక్టర్ ఇమ్మడి ప్రసాద్ తండ్రి ఇమ్మడి రంగారావు కొద్దిసేపటి క్రితం అనారోగ్యంతో మరణించారు. అట్టి విషయం తెలుసుకున్న పలు పార్టీల నేతలు, ఆర్యవైశ్యులు రంగారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులూర్పిస్తున్నారు.



రేగొండలో రూ27.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, నూతన పింఛన్ల పంపిణీ

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ



భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం సంక్షేమ పథకాల ప్రయోజనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండలంలోని 677 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాలు,41 మందికి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 72 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ27,50,450 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వితంతువులు, దివ్యాంగులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అర్హులందరికీ ప్రజా ప్రభుత్వం నూతన పింఛన్లు మంజూరు చేసిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు.ఆడపిల్లల పెళ్లిళ్లు పేద కుటుంబాలకు భారం కాకూడదనే కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, అనారోగ్య బాధితులకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్యాక్స్ చైర్మన్ నడిపెల్లి విజ్జనురావు , కోటంచ దేవాలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నం రవి, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో సమస్య పరిష్కారానికి కృషి చేసిన యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ బృందం

ఎస్సై సృజన్ కుమార్‌ను కలిసి సమస్యను వివరించిన ప్రతినిధులు

పాలకుర్తి నవంబర్ 14(తెలుగు గళం)

జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఓ సమస్య పరిష్కారానికి యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ అండ్ లీగల్ అవెర్నెస్ బృందం సభ్యులు చొరవ చూపారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై సృజన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సంబంధిత సమస్య వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా సమస్యకు సంబంధించిన వివరాలను ఎస్సైకి వివరించి, బాధితులకు న్యాయం జరిగేలా ఇరువైపుల వివరాలను పరిశీలిస్తూ సామరస్యపూర్వకంగా పరిష్కారం చూపేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు.సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందాలనే లక్ష్యంతో యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సంస్థ పనిచేస్తోందని బృందం సభ్యులు తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన పరిధిలో పరిష్కారానికి కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో



యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ బృందం రాష్ట్ర సభ్యులు కమలాకర్‌తో పాటు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు లలిత, నల్లగొండ జిల్లా జనరల్ సెక్రటరీ సునీత, ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సలీం, జనరల్ సెక్రటరీ గొల్లపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో అయ్యప్ప స్వాములు..

కొండాపురంలో కన్నుల పండువగా పడిపూజ

అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన గ్రామం

-- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

తెలుగు గళం న్యూస్ పామిడి



కొండాపురం: స్థానిక పామిడి పంచాయతీ పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూర్య సప్లయర్ గృహంలో గురుస్వామి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు.

అయ్యప్ప దీక్ష చేపట్టి మాలధారణ చేసిన స్వాములు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి నామస్మరణలు, భక్తి గీతాలు, శరణుఘోషలతో కొండాపురం గ్రామం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తుల శరణుఘోషలతో పరిసర ప్రాంతాలన్నీ మారుమోగాయి.

ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములతో పాటు శివమాలధారణ భక్తులు, ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తిపూర్వకంగా పూజలు సమర్పించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

అనంతరం అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం కలగలిసిన ఈ పడిపూజ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎంపెడులో రూ.22 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర శంకుస్థాపన

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల



భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుమట్ల మండలం ఎంపెడు గ్రామంలో రూ22 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన అంగన్వాడీ,వివో సంఘ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మహిళా సంక్షేమానికి, చిన్నారుల భవిష్యత్తుకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా,సామాజికంగా ఎదిగేందుకు వీలుగా సంఘ భవనాలు నిర్మిస్తున్నామని, చిన్నారులకు మెరుగైన వాతావరణంలో పౌష్టికాహారం,ప్రాథమిక విద్య అందించేందుకే నూతన అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించిన ఆయన, భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్14(తెలుగు గళం) న్యూస్:

సత్తుపల్లి బీజేపీ టౌన్ అధ్యక్షుడు బానోత్ విజయ్, టౌన్ ప్రధాన కార్యదర్శి మందా శివ యాదవ్, బీజేపీ యువమోర్చా టౌన్ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకులు ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల ద్వారా ముందస్తు అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించే గొంతుకలను అరెస్టులతో అణచివేయాలని చూడటం సరికాదన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు, హామీల అమలుకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



వంద మార్కులు కాదు, వంద మందికి సాయమే గొప్ప

- సర్పంచ్ కనుకయ్య యాదవ్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/నవంబర్ 14

వరంగల్ జిల్లా: పర్వతగిరి మండలం జమాల్ పురం సోమారం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ముఖ్య అతిథిగా హాజరైన జమాల్ పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ విద్యార్థులకు స్ఫూర్తివంతమైన ప్రసంగం చేశారు.నెహ్రూ ఆశయాలను గుర్తుచేస్తూ, తాను పలక,బలపంతో 5 కి.మీ నడిచి చదివిన రోజులను గుర్తుచేశారు. పిల్లలకు మూడు సూత్రాలు చెప్పారు–పెద్ద కలలు కనండి, మంచి మనిషిగా ఎదగండి, ఊరిని మర్చిపోవద్దు.” వందకి వంద మార్కులు రావడం గొప్పకాదు, వంద మందికి సహాయం చేయడం గొప్ప”అనిపేర్కొన్నారు. తల్లిదండ్రులకు పిల్లలను ఇతరులతో పోల్చవద్దని, ఫోన్ చేతిలో పెట్టి బాధ్యత తీరిందనుకోవద్దని సూచించారు.వచ్చే విద్యా సంవత్సరం లోపు డిజిటల్ క్లాస్ రూమ్,సాయంత్రం ఆటలకు లైట్లు, 7వ తరగతిలో మంచి మార్కులు తెచ్చిన పేద విద్యార్థులకు పంచాయతీ నుండి ప్రత్యేక బహుమతి ఇస్తానని హామీ ఇచ్చారు. హాజర సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గ్రామస్తులు.తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయాలే దేశ ప్రగతికి మార్గదర్శకం -- కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు..

తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 14:



ఏటూరునాగారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి నెహ్రూ జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ పాత్ర, స్వతంత్ర భారతదేశ తొలి ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి ఆయన వేసిన బలమైన పునాదులు చిరస్మరణీయమని కొనియాడారు. విద్య, విజ్ఞానం, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. చిన్నారులపై ఆయనకున్న అపారమైన ప్రేమకు గుర్తుగా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత విద్య, సామాజిక సేవ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, యువజన నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంబాపూర్‌లో ఘనంగా బాలల దినోత్సవం



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 14 (తెలుగు గళం):

బాలసభ నిర్వహణ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేసిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కంబాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో నేడు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ గురుకుల సుజాత శ్రావణ్ దేశాయ్ ఆధ్వర్యంలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం అధ్యక్షురాలు, ఆశా వర్కర్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



పట్టభద్రుల గలం అయిత, బిసిల స్వరం అయిత

▸▸వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ▸▸ నేను ఈ ప్రాంత బిడ్డని బీసీ సామాజిక వర్గానికి చెందిన బిడ్డని ▸▸ఉద్యమ చరిత్ర, ఉద్యమ సమయంలో లాఠీ దెబ్బలు తిన్న వ్యక్తిని ▸▸ నిరుద్యోగుల ఆశయ సాధనకు కృషి చేస్తా ▸▸ స్థానిక ఎమ్మెల్సీ పై ఘాటు వ్యాఖ్యలు ▸▸ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ ▸▸పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్చార్జి ఇస్మాయిల్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని లయన్స్ క్లబ్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాక సమావేశం తెలంగాణ రక్షణ సేన పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి వేణు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఇస్మాయిల్ మాట్లాడుతూ వందల మంది త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అమరుల ఆశయాలు నెరవేర్చడంలో ఎంతమేర లక్ష్యం చేరింది అన్నారు ? తెలంగాణ పాలకులు తమ స్వార్థానికి దుర్వినియోగం చేశారు అన్నారు . నిధుల వినియోగంలో అవినీతి.. నీళ్ల వినియోగంలో నిర్లక్ష్యం.. ఉపాధి కల్పనలో అక్రమాలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న పాలకుల పట్ల అసహ్యం కలుగుతున్నది అన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీయలేని అసమర్థ ప్రతిపక్షపు అసలు రూపును ప్రజలకు వివరించడానికే కల్వకుంట్ల కవితమ్మ నేతృత్వంలో టీఆర్ఎస్ పురుడు పోసుకుంది అన్నారు . దశాబ్దాలుగా ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో కునారిల్లుతున్న పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి పాంచజన్యం పూరించింది అన్నారు .ఈ సందర్భంగా పట్టభద్రుల టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయాయి అన్నారు,అమరుల ఆశయాలకు ప్రాధాన్యమివ్వలేదు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ అధికారంలోకి వస్తే ' ఏం చేస్తామో స్పష్టం చేస్తున్నది తెలంగాణ రక్షణ సేన పార్టీ అన్నారు. రాష్ట్రంలో 15 వేల పోలీస్ కానిస్టేబుల్ ఖాళీలను పూరించకుండా ప్రభుత్వం 5000 పోస్టులు ఖాళీలుగా ఉన్నట్లు చెబుతుందని, నిరుద్యోగులను మోసం చేసింది అన్నరు, ఉచితంగా విద్య, వైద్యం, అందించి పేదలకు అండగా ఉండాలన్నది టీఆర్ఎస్ ఉద్దేశం అన్నారు. స్థానిక ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీంద్రరావుపై నిప్పులు చెరిగారు, రవీంద్రరావుకు దమ్ముంటే సిగ్గు శరం ఉంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఎన్నికల బరిలో నిలబడాలని సవాల్ విసిరారు, రవీంద్ర రావు లాంటి నీచ రాజకీయాలు చేసే వ్యక్తి తెలంగాణలో మరొకరు లేరన్నారు, ప్రత్యక్ష రాజకీయాలకు పనికిరాని నాయకుడు అంటూ ఘాట్ వ్యాఖ్యలు చేశారు, బండి పుల్లయ్య,శ్రీరామ్ భద్రయ్య, వేం నరేందర్ రెడ్డి,లాంటి నాయకులను,మరి కొంతమంది నాయకులని మోసం చేశారన్నారు,తెలంగాణ రక్షణసేన తొలిసారి ఎన్నికల బరిలో దిగింది. చట్టసభల్లో ప్రజాగొంతుకై సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులను అందరి కంటే ముందే ప్రకటించింది టీఆర్ఎస్ పార్టీ అన్నారు, నల్గొండ- ఖమ్మం- వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గాలకు బీసీ అభ్యర్థులను ప్రకటించి సామాజిక న్యాయంపై టీఆర్ఎస్ తన చిత్తశుద్ధిని చాటుకున్నది అన్నారు, కల్వకుంట్ల కవితమ్మ ఆశీర్వదించి మీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నాను అన్నారు, నేను ఈ మానుకోట బిడ్డను ఈ ప్రాంత బిడ్డను ఒక బీసీ బిడ్డను నన్ను ఆదరించి పట్టబద్రుల స్థానానికి ఎంపిక చేయాలని మీ అందరిని కోరుకుంటున్నాను అన్నారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తెలంగాణ ఉద్యమకారుడు, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఉన్నత విద్యావంతుడుగా ఎదిగిన గీత కార్మిక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ని,ప్రజా సమస్యలపై కొన్నేళ్లుగా క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేసిన, లాఠీ దెబ్బలు తిన్న, మిలో ఒకడిగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల బిడ్డగా నన్ను ఆశీర్వదించి మీకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు,తెలంగాణకు ప్రాణం పోయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న కల్వకుంట్ల కవితమ్మ అండగా మీరందరూ ఉండాలన్నారు. విద్యావంతులు మేధావులు బుద్ధి జీవులు మీ అమూల్యమైన ఓటును వేసి ఈ ప్రాంత బిడ్డగా, మీ బిడ్డ గా నన్ను శాసనమండలికి పంపించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు మారపెల్లి మాధవి, మహబూబాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బోడ అనిల్ నాయక్,రాజేష్,హర్షిత్,సందీప్,టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.